క్లుప్తంగా

వాడపల్లి వెంకన్న ఆలయానికి రూ.55 వేల విరాళం


దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ కిషోర్‌కుమార్

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు రూ.55 వేలు విరాళంగా ఇచ్చారు. అర్తమూరుకు చెందిన వెలగల వెంకటరెడ్డి, మంగాయమ్మ దంపతులు ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి రూ.30 వేలు, గోశాలకు రూ.25 వేలు విరాళాన్ని గురువారం అందజేశారు. దాతకు దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం అందజేశారు.

రాజేంద్రప్రసాద్‌కు రాష్ట్ర స్థాయి విశిష్ట పురస్కారం


రాజేంద్రప్రసాద్‌ను సత్కరించిన యూనియన్ సభ్యులు

ఆత్రేయపురం: మండలంలో సీఆర్‌ఎంటీగా పనిచేస్తున్న అరిగెల రాజేంద్రప్రసాద్ కాకినాడ చేయూత సేవా స్వచ్ఛంద సంస్థ ద్వారా రాష్ట్ర స్థాయి విశిష్ట పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్‌ను ఎస్టీయూ యూనియన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ నాతిబుజ్జి ముఖ్య అతిథిగా పాల్గొని రాజేంద్రప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో వరప్రసాద్, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రావులపాలెం: పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపేందుకు విద్యార్థులకు మూడు రోజుల పాటు కెరీర్ గైడెన్స్‌పై ఇస్తున్న ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ సత్యమూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కెరీర్ గైడెన్స్ సెల్ చైర్మన్ కె.రజిని ఆధ్వర్యంలో మూడో ఏడాది చదువుతున్న విద్యార్థులకు విద్య, ఉద్యోగం, భవిష్యత్తు ప్రణాళికలపై శిక్షణ అందించారు. రాజమహేంద్రవరం ఐఏసీఈ కాంపిటేటివ్ అకాడమీ సీనియర్ ట్రైనర్లు ఎం.రమేష్, ఎ.రామకృష్ణలు స్టాఫ్ సెలక్షన్, బ్యాంక్ , రైల్వే, ఇతర పోటీ పరీక్షలకు సంబంధించి అర్థమెటిక్, రీజినింగ్, ఆప్టిట్యూడ్, కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ తదితర సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యమూర్తి తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సిద్దార్థ, సుందర రామిరెడ్డి, సుభాషిణి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు అల్పాహార కిట్ల పంపిణీ

మామిడికుదురు: ఉమ్రా యాత్రకు వెళ్తున్న ముస్లిం భక్త బృందానికి పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురువారం అల్పాహార కిట్లను అందజేశారు. నగరం పెద పంజీషాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే సత్యనారాయణ, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పాల్గొన్నారు. 20 మంది భక్తుల బృందం ఉమ్రా యాత్రకు వెళ్తుండగా వారికి అల్పాహారం కిట్లు అందించి, యాత్ర సజావుగా సాగాలని అభిలాషించారు. కార్యక్రమంలో జాలెం సుబ్బారావు, ముకరం హుస్సేన్, సూదా బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్

మామిడికుదురు: మండలంలోని పాశర్లపూడి గ్రామంలో దోమల నిర్మూలన చర్యల్లో భాగంగా గురువారం పొగ యంత్రం ద్వారా ఫాగింగ్ చర్యలు చేపట్టారు. రెండు రోజుల నుంచి గ్రామంలోని ప్రధాన ప్రాంతాలతో పాటు ముంపు నీరు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి పర్యవేక్షణలో చేపట్టిన ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

పి.గన్నవరం: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో దాతల సాయంతో గర్భిణులకు పాలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నల్లా పెదకాపు, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ హరీష్‌ను కలిసిన శ్రీకృష్ణ యాదవ్ సంఘం

మలికిపురం: అమలాపురంలో ఎంపీ హరీష్ మాధూర్‌ను కోనసీమ జిల్లా శ్రీకృష్ణయాదవ్ సంఘం ప్రతినిధులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు యాదవులకు త్వరలో భర్తీ చేసే నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలని కోరారు. అంతర్వేదిలో లక్ష్మీనృసింహునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించిన నాటి భక్తుడు మందపాటి కేశవదాసు యాదవ్ విగ్రహ ప్రతిష్ఠకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బాబూ.. తీయొద్దు మా జాబు

- వచ్చే నెల 1 నుంచి నూతన మద్యం పాలసీ
- అగమ్యగోచరంగా మద్యం షాపుల ఉద్యోగుల పరిస్థితి


అంబాజీపేటలో ప్రభుత్వ మద్యం దుకాణం

అంబాజీపేట: నూతన పాలసీతో మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అక్టోబర్ 1 నుంచి అమలు చేస్తామని ప్రకటించడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మద్యం దుకాణాల్లో అక్రమాల కట్టడి, అధిక ధరలు, బెల్టుషాపుల నియంత్రణకు ఐదేళ్లుగా ప్రభుత్వ పర్యవేక్షణలోనే మద్యం దుకాణాల నిర్వహణ సాగింది. ఈ క్రమంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కాయి. ఒక్కో షాపులో సూపర్‌వైజర్, సేల్స్‌మెన్, నైట్‌వాచ్‌మెన్‌లు కలిపి నలుగురు నుంచి ఐదుగురు చొప్పున పనిచేస్తున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి సిద్ధమవుతుండడంతో తమ భవిష్యత్ ఏమవుతుందోనని వారంతా ఆందోళన చెందుతున్నారు.

నాడు ఉద్యోగాలిస్తే ఇప్పుడు తీసేస్తారా?

2019కి ముందు ఉన్న మద్యం దుకాణాలకు ప్రతి రెండేళ్లకోసారి టెండర్లు పిలిచేవారు. లాటరీ పద్ధతిన దుకాణాలు కేటాయించేవారు. మహిళలు సైతం టెండర్లలో పాల్గొనేవారు. కొన్ని ముఖ్యమైన మద్యం దుకాణాలకు డిమాండ్ ఉండేది. ప్రైవేటు దోపిడీని అరికట్టేందుకు 2019లో అధికరంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ దుకాణాలకు శ్రీకారం చుట్టింది. అవినీతి అక్రమాలకు చెక్‌పెట్టి పలువురు నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. పి.గన్నవరం నియోజకవర్గంలో 12, కొత్తపేట నియోజకవర్గంలో 18, రాజోలు నియోజకవర్గంలో 10 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఏపీ రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ల ద్వారా నియామకాలు చేపట్టింది. సూపర్‌వైజర్లకు నెలకు రూ.21,500, సేల్స్‌మెన్లకు రూ.19,500, నైట్ వాచ్‌మెన్లకు రూ.9,500 వేతనంగా అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న ఉద్యోగులంతా రోడ్డున పడనున్నారు. తమను విధుల నుంచి తొలగిస్తే తాము ఆందోళన బాట పడతామని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు చెబుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాను. నూతన పాలసీతో మా ఉద్యోగాలు ఏమవుతాయోనని ఆందోళనకు గురిచేస్తుంది. వందలాది కుటుంబాలు మద్యం దుకాణాలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– రొక్కాల బాపూజీ, సేల్స్‌మెన్, అంబాజీపేట

ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి



ప్రభుత్వ మద్యం పాలసీకి మేం వ్యతిరేకం కాదు. అయితే ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

– జల్లి సురేష్‌బాబు, సూపర్‌వైజర్, అంబాజీపేట

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అయినవిల్లి: 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం మండల పరిధిలోని కె.జగన్నాథపురం, క్రాప, పోతుకుర్రు, శంకరాయగూడెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఈఈ మోకా రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పి.గన్నవరం: నాగుల్లంక ఫీడర్ పరిధిలోని 11 కేవీ లైన్‌కు మరమ్మతుల పనులు నిర్వహిస్తున్న కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఏఈ ఆనందరాజు తెలిపారు. ఫీడర్ పరిధిలోని పి.గన్నవరం మండలానికి చెందిన లంకల గన్నవరం, మొండెపులంక, పెద కందాలపాలెం, నాగుల్లంక, చాకలిపాలెం, వాడ్రేవుపల్లి, మానేపల్లి, పుచ్చల్లంక, రాయిలంక, కనకాయలంకల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

మామిడికుదురు: 11 కేవీ లైన్‌లో వార్షిక మరమ్మతుల పనుల నిమిత్తం ఈదరాడ, కొమరాడ, లూటుకుర్రు, మాకనపాలెం, ఆదుర్రు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి


అంబాజీపేటలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

అంబాజీపేట: ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలని ఎంఈఓ–1 కాంగ్రేగుల వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మండల స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి అందె సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను గురువారం నిర్వహించారు. అండర్–14, 17 విభాగాల్లో మండలంలోని బాలికలకు యోగా, షటిల్, అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం కడలి సాయిరామ్ మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో పీడీలు కుంపట్ల ఆదిలక్ష్మి, పెచ్చెట్టి సూర్యనారాయణ, బూల చిరంజీవి, ముత్యాల పవన్‌కిషోర్, మట్టా శ్రీనివాస్, పీఈటీలు ఏవీ శ్రీనివాస్, అందె సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం నింపిన భీమన్న రచనలు


మామిడికుదురులో మహాకవి భీమన్నకు నివాళులర్పిస్తున్న సాహితీ అభిమానులు

మామిడికుదురు: మహాకవి బోయి భీమన్న రచనలు ప్రజల్లో చైతన్యం నింపాయని గెయిల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్ మేనేజర్ ఎ.సురేష్ పేర్కొన్నారు. భీమన్న 114వ జయంత్యోత్సవంలో భాగంగా గురువారం మామిడికుదురులోని బోయి భీమన్న మానవ వనరుల కేంద్రం ప్రాంగణంలో ఉన్న భీమన్న విగ్రహానికి పలువురు సాహితీ అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మామిడికుదురు గ్రామంలో పుట్టిన భీమన్న తన రచనల ద్వారా ఈ ప్రాంతానికి జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు తీసుకొచ్చారన్నారు. భీమన్న రాసిన పాలేరు నాటకం ద్వారా ఎంతో మంది స్ఫూర్తి పొంది ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విప్పర్తి శ్రీనుబాబు, బొంతు చంద్రమోహన్, గంటి చంద్రశేఖర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్య వీచికలు

రాజోలు: డాక్టర్ బోయి భీమన్న రచనలు సామాజిక చైతన్య వీచికలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు అన్నారు. గురువారం బోయి భీమన్న 114వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని భీమన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోయి భీమన్న రచించిన ‘పాలేరు’ నాటకం ఎంతో మంది జీవితాల్లో మార్పు తీసుకొచ్చిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శాంతిరాజశ్రీ, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, అధ్యాపకులు శైలజ, నాగరాజు, అశ్వని, బోయి భీమన్న ట్రస్ట్ సభ్యుడు గంటి చంద్రశేఖర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బోయి భీమన్న జయంతి వేడుకలు

పి.గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద అంబేడ్కర్ సాహితీ సమితి చైర్మన్ నేలపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం బోయి భీమన్న జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భీమన్న చిత్రపటానికి ఎంఈఓ కోన హెలీనా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈఓ హెలీనా, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్ తదితరులను ఘనంగా సత్కరించారు.

ఇసుక ర్యాంపు నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు సాయిబాబా

ఆత్రేయపురం: మండల పరిధిలోని అంకంపాలెం గ్రామంలో ఇసుక ర్యాంపు నిర్వహణపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కోసం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సందీప్‌రెడ్డిల ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ నిషాంతి మాట్లాడుతూ అంకంపాలెంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇసుక ర్యాంపు ఏర్పాటు విషయంలో ఎవరికైనా అభ్యంతరాలుంటే తెలపాలని కోరారు. ఏడీ మైన్స్ సాయిరాం సింగ్ మాట్లాడుతూ ఇసుక రీచ్‌లో 9.85 హెక్టార్లలో 98,540 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు సంబంధించి ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు చేపట్టే చర్యలను వివరించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కొత్తపేట ఆర్‌డీఓ జీవీవీ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబు, ఎంపీడీఓ నాతిబుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


ముక్తేశ్వరం సెంటర్‌లో చెత్తను తొలగిస్తున్న సర్పంచ్ కాకర శ్రీనివాస్ తదితరులు


అంతర్వేదిలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ

అంబాజీపేట: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సెయింట్ మేరీ పాఠశాలలో మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరిసరాలతో పాటు ఇంటిని శుభ్రంగా ఉంచడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ శాంతకుమారి స్వచ్ఛభారత్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బి.మమత, పంచాయతీ కార్యదర్శి జీవీవీకే కుమార్, డ్వాక్రా ఏపీఎం గంగాధర్, ఎస్‌ఎస్‌ఎం ప్రిన్సిపల్ ఎస్.రాధమణి, నాగాబత్తుల సుబ్బారావు, అంబాజీపేట ఎస్‌ఎస్‌ఎం కళాశాల విద్యార్థులు, నాగాబత్తులవారిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అయినవిల్లి: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం కాపాడుకోవచ్చునని ఈఓపీఆర్డీ వాణిశ్రీ బెథ్రూన్, అయినవిల్లి సర్పంచ్ కాకర శ్రీనివాస్ అన్నారు. గురువారం ముక్తేశ్వరంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముక్తేశ్వరం సెంటర్ వ్యాపార కూడలిలో ఉన్న చెత్తను సర్పంచ్ కాకర శ్రీనివాస్, పాలకవర్గ సిబ్బంది, పంచాయతీ కార్యాలయ సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు, ఉప సర్పంచ్ పోలిశెట్టి రాజేష్, నాయకులు కూడుపూడి దుర్గారావు పాల్గొన్నారు.

మామిడికుదురులో ఉచిత వైద్య శిబిరం

మామిడికుదురు: స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మామిడికుదురు ఎస్టీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కాలనీకి చెందిన 45 మందితో పాటు పారిశుధ్య కార్మికులకు ఉచితంగా బీపీ, షుగర్ రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, కార్యదర్శి సీహెచ్‌ఓ సత్యవతి, హెల్త్ అసిస్టెంట్ కేవీ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ కె.శిరీష, ఏఎన్‌ఎంలు కె.దుర్గాదేవి, ఎం.జయకుమారి, కె.లక్ష్మీకుమారి, బి.మాధురి, వి.ప్రభావతి పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన పథకం షెడ్డు వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని సిబ్బందితో కలిసి ఆయన పరిశుభ్రం చేశారు. అలాగే తూర్పు రాజగోపురం, ఆలయ ప్రహరీల వద్ద గడ్డి మొక్కలను తొలగించే పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పి.విజయసారథి, సీనియర్ అసిస్టెంట్ బీహెచ్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి దిండి రాంబాబు, డివిజనల్ పంచాయతీ అధికారి ఎ.రాజు అన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గుమ్మిలేరు గ్రామ పంచాయతీని వారు ఆకస్మికంగా సందర్శించారు. గ్రామమంతటా పర్యటిస్తూ పారిశుధ్య పనులను పరిశీలించి సూచనలు, సలహాలు అందజేశారు.

ఘనంగా గణేష్ నిమజ్జనాలు


అంబాజీపేట శ్రీరామ్‌నగర్‌లో గణపతిని ఊరేగిస్తున్న భక్తులు

కొత్తపేట: మండల కేంద్రం కొత్తపేటతో పాటు వివిధ గ్రామాల్లో గణేష్ నిమజ్జనోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. గణపతి నవరాత్ర పందిర్లలో పూజలందుకున్న గణపతి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లోకి ఎక్కించి యువకులు, బాలల కోలాహలం నడుమ ఘనంగా ఊరేగించి స్థానిక ప్రధాన పంట కాలువల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. మండల పరిధిలోని వానపల్లి గ్రామంలో పాతరామాలయం వీధి గణపతి నవరాత్ర ఉత్సవ పందిరి గణపతిని ప్రత్యేక రథంలో ఊరేగించారు.


అయినవిల్లి: గణపతి నవరాత్రుల్లో భాగంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను ముగింపు వేడుకల్లో భాగంగా పలు గురువారం గ్రామాల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు. తొత్తరమూడిలోని కంచివారి కాఫీ హోటల్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాన్ని ప్రత్యేక రథంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. ఈ సందర్భంగా యువత కేరింతలు కొడుతూ డ్యాన్సులు చేశారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిపారు.

అంబాజీపేట: మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుడి నిమజ్జనాలు కోలాహలంగా నిర్వహించారు. అంబాజీపేట బస్టాండ్ వద్ద శ్రీసిద్ధి వినాయక ఆటో యూనియన్ ఆధ్వర్యంలో, జయంతి నగర్ శ్రీలక్ష్మీగణపతి ఆలయం వద్ద, గంగలకుర్రు అగ్రహారం, పుల్లేటికుర్రు, ముక్కామల, తొండవరం, ఇసుకపూడి, చిరతపూడి తదితర గ్రామాల్లో నిమజ్జనాల అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. జయంతినగర్‌లో వినాయక లడ్డూను కోట రాంబాబు రూ.7,800కు దక్కించుకున్నారు. డైలీమార్కెట్ వెనక శ్రీరామనగర్ సిద్ధి వినాయక ఆలయం వద్ద స్వామివారి లడ్డూను గవరరాంబాబు రూ.15 వేలకు కైవసం చేసుకున్నారు.

లడ్డూలకు వేలం పాట

పి.గన్నవరం: ఎల్.గన్నవరం గ్రామంలోని యువ బాలగణపతి స్వామివారి వినాయక చవితి మండపం వద్ద గురువారం స్వామివారి లడ్డూలను వేలం నిర్వహించగా రూ.64,700కు భక్తులు పాడుకున్నారు. మొదటి లడ్డూను నల్లా సత్యనారాయణ సోదరులు రూ.45,000కు, రెండో లడ్డూను చిట్టాల తాతాజీ రూ.5 వేలకు, మూడో లడ్డూను అడ్డగళ్ల హేమంత్ రూ.5,100, నాలుగో లడ్డూను అంబటి శ్రీను రూ.5,100కు, ఐదో లడ్డూను యర్రంశెట్టి గోపాలరావు రూ.4500కు వేలంలో దక్కించుకున్నారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిల్పి వుడయార్‌కు రేలంగి పురస్కారం


రాజమహేంద్రవరంలో శిల్పి రాజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న మంత్రి దుర్గేష్ తదితరులు

కొత్తపేట: అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్ వుడయార్‌కు ప్రముఖ హాస్య నటుడు రేలంగి వెంకట్రామయ్య పురస్కారం లభించింది. రాజమహేంద్రవరంలో గోదావరి గట్టున నెలకొల్పిన రేలంగి కాంస్య విగ్రహాన్ని కొత్తపేటకు చెందిన శిల్పి ఆచార్య రాజ్‌కుమార్ వుడయార్ రూపొందించిన విషయం తెలిసిందే. రాజమహేంద్రవరం గౌడ, శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన ఆ విగ్రహాన్ని గురువారం రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం విగ్రహ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో విగ్రహ శిల్పి రాజ్‌కుమార్‌ను మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా రేలంగి పురస్కారంతో ఘనంగా సత్కరించారు.

రైతులకు అవగాహన సదస్సు

పి.గన్నవరం: ఆత్మ పథకంలో భాగంగా మండలంలోని ఊడిమూడి గ్రామంలో వరిలో వచ్చే చీడపీడల నివారణపై రైతులకు ముమ్మిడివరం డీఏఏటీటీసీ సైంటిస్ట్ డాక్టర్ ఎం.నందకిషోర్ గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వరిలో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేనుకు వాడాల్సిన మందులపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్, ఏఓ జె.మనోహర్, పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహన్‌రావు, ఎంపీఓ ఎ.కళ్యాణ్ సూర్యకుమార్, ఊడిమూడి సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, ఎంపీటీసీలు ఆదిమూలం సూరయ్యకాపు పాల్గొన్నారు.

9వ రోజుకు చేరిన నిరసన దీక్షలు

మలికిపురం: స్థానిక డిగ్రీ కళాశాల అధ్యాపకుల నిరసన దీక్షలు గురువారం తొమ్మిదో రోజుకు చేరాయి. కళాశాల వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో అధ్యాపకులకు మద్దతుగా పలువురు నాయకులు, మేధావులు మద్దతు తెలిపారు. సిబ్బందికి బకాయిలు వెంటనే చెల్లించి వారి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది ప్రేమ్‌కుమార్, గెద్దం పేర్రాజు, సీహెచ్ సూర్యప్రకాశరావు, దేవ రాజేంద్రప్రసాద్, కుసుమ నాని, జిల్లెల్ల ఉదయ్ పాల్గొన్నారు. కాగా గత పది రోజులుగా క్లాసులు జరగకపోవడంతో తల్లితండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

సమస్య పరిష్కారానికి కృషి

ఏఎఫ్‌డీటీ విద్యాసంస్థల సిబ్బంది జీతభత్యాల సమస్య పరిష్కారానికి కళాశాల పాలకవర్గం అన్ని ప్రయత్నాలు చేస్తోందని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణమూర్తి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంస్థకు సంబంధించి ఎటువంటి ఆర్థిక అవకతవకలు జరగలేదన్నారు. కళాశాలలో బాధ్యతలను సక్రమంగా నెరవేర్చని కొంతమంది స్టాఫ్‌ను మందలించిన కారణంగా వ్యక్తిగత కక్షతో ఈ సమ్మె చేయిస్తున్నారన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

అంబాజీపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.సరోవర్ తెలిపారు.